ప్రజాశక్తి

మంగళవారం 29 జూలై 2025

5

అల్లూరి సీతారామరాజు




రిజిస్ట్రేషన్ కోసం రోగుల ఇక్కట్లు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్‌తో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రిలో వైద్యం పొందాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇది ఫోన్ ద్వారానే చేసుకోవాలి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జ్వరాలు, వాంతులు, తలనొప్పులతో బాధపడుతూ ఆసుపత్రి వరకు వచ్చిన రోగులు గంటల తరబడి రిజిస్ట్రేషన్ కోసం క్యూలో నిలబడుతున్నారు. . ఇందులో అత్యవసర వైద్యం వారు కూడా వేచి చూడాల్సిన దుస్థితి ఎదురవుతోంది. తక్షణమే రిజిస్ట్రేషన్ కౌంటర్ల సంఖ్యను పెంచాలని, సాంకేతిక వనరులను విస్తరించాలని, అత్యవసర రోగులకు ప్రాధాన్యతనిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జ్వర బాధితులు అధికారులను వినతించుకుంటున్నారు.



వేచివున్న రోగులు



మాట్లాడుతున్న అప్పలనర్స

ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ ఇచ్చాకే..

ఏజెన్సీలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

డిఎస్‌సి సాధన కమిటీ రాష్ట్ర సదస్సులో అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంత టీచర్స్ పోస్ట్ మినహాయింపు కై గిరిజన సలహా మండలి (టి. ఏ. సి) లో తీర్మానం చేయాలనీ ఆదివాసీ రాష్ట్రీయ అధికార్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నరస డిమాండ్ చేశారు.పాడేరు మోదకొండమ్మ గుడి వద్ద ఆదివాసీ డీఎస్సీ సాధన కమిటీ ఆదివాసీ నిరుద్యోగుల సంఘం అధ్వర్యంలో రాష్ట్ర సదస్సు సోమవారం నిర్వహించారు .ఈ సదస్సులో ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భం గా పి.అప్పలనరస మాట్లాడుతూ, స్థానిక ఆదివాసులకే ఉద్యోగాలు ఇస్తామని సిఎం ఇచ్చిన హామీ అమలుకు టి.ఏ.సి లో తీర్మానం చేయాలనీ డిమాండ్ చేశారు. శతశాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే ఏజెన్సీ ప్రాంతంలో టీచర్స్ పోస్టులు భర్తీ చేయాలనీ కోరారు. దీనికి అనుగుణంగా మెగా డీస్సి నోటిఫికేషన్ లో పేర్కొన్న ఏజెన్సీ ప్రాంత టీచర్స్ పోస్టులు మినహాయింపు ఇవ్వాలని తదనంతరం ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. గత నాలుగున్నర ఏళ్లుగా ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ నూరు శాతం రిజర్వేషన్ సాధనకై పోరాడుతుందని, రాష్ట్ర గిరిజన మంత్రి, సి. ఎం. ఓ ఆఫీస్ తో నిర్వహించిన చర్చలు అనంతరం నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామని సి. ఎం ప్రకటించారన్నారు.మెగా డీఎస్సీలో అమలుకు ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో వేలాది మంది టీచర్స్ ఉద్యోగ కోల్పోయి నిరుద్యోగులగా మిగిలి పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 50శాతం లేదా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించడం తీవ్రమైన తప్పిదం అవుతుందన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం చర్యలు ఉంటే మాత్రం తీవ్ర ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించారు.

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బలదేవ్ మాట్లాడుతూ, ఐదో షెడ్యూల్ ప్రాంతంలో 1/70 భూ బదలాయింపు నిషేద చట్టం, పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టం వంటి కఠినమైన రాజ్యాంగ చట్టాలు అమలులో ఉన్నాయని, వాటిని ఉల్లంఘించడానికి వీలులేదన్నారు.

ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.ధర్మన్న పడాల్, కోకన్వీనర్ కూడ రాధాకృష్ణ మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రాంతంలో జనాభా ఆధారిత రిజర్వేషన్లకు తావులేదని, చట్టపరంగా ప్రమాదకరమై నదిగా పరిణమించి, సామాజిక అశాంతిని, రాజ్యాంగపరమైన సమస్యలు పుట్టిస్తాయని తెలిపారు. ఆదివాసేతరుల వలసలను ప్రోత్సహించి, ఆదివాసుల భూముల దుర్వినియోగం, రాజకీయ దోపిడీ జరగడానికి అవకాశం కల్పిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్న పడాల్ కోకన్వీనర్ రాధాకృష్ణ, డీఎస్సీ అభ్యర్థులు ఎం భవాని రాణి, కృష్ణం పడాల్, శంకర్, రాజం నాయుడు, రాజు ప్రవీణ్, విష్ణుమూర్తి, వినయ్, చలపతి పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా బాధితులను ఆదుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



పరామర్శిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి- హుకుంపేట: సికిల్ సెల్ ఎనీమియాతో మరణించిన పావని కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లించాలని, ఈ వ్యాధి బాధితులందరికీ షరతులు లేకుండా నెలసరి పెన్షన్ ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, డిమాండ్ చేశారు.ప్రస్తుతం 2300 మంది బాధితులలో కేవలం 1300 మందికే పెన్షన్ అందుతుండగా, మిగిలిన 1000 మందికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. హుకుంపేట మండలంలోని ములియాపుట్టు గ్రామానికి చెందిన బండంగి పావని (18) అనే యువతి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతూ ఈనెల 27న కేజీహెచ్‌లో మృతి చెందింది.ఈ మేరకు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా మహిళా సంఘ కార్యదర్శి ఎస్.హైమావతి, మండల కార్యదర్శి టీ.కృష్ణారావు, తదితరులు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాధి బాధితులకు ఉచితంగా రక్తం, పౌష్టికాహారం అందించాలన్నారు. పాడేరు మెడికల్ కాలేజ్ పరిధిలో శాశ్వత పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మళ్లీ బదిలీలు!

-ఆందోళనలో హెల్త్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఉమ్మడి విశాఖ జిల్లాలోని పాడేరు ఐటిడిఏ పరిధిలో 11 మండలాల్లో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లకు తరచుగా అధికారులు బదిలీల ప్రక్రియ చేపడుతుండడంతో హెల్త్ అసిస్టెంట్లు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల గత రెండు నెలల క్రితం హెల్త్ అసిస్టెంట్లకు వైద్య సిబ్బందికి బదిలీల ప్రక్రియ చేపట్టారు. అప్పుడు చేపట్టిన బదిలీల ఆర్డర్ కాపీలను ఇవ్వకుండా మళ్ళీ బదిలీలు చేపడతామని ఉన్నతాధికారులు చెబుతుండడంతో హెల్త్ అసిస్టెంట్లు మనోవేదనకు గురవుతున్నారు.

పాడేరు ఐటిడిఏ పరిధి 11 మండలాల్లో 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రల్లో 140 మంది హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరందరికీ ఇటీవల రెండు నెలల క్రితం బదిలీ చేసి ఆర్డర్ కాపీలు ఇవ్వకపోవడంతో వారు ఆర్డర్ కాపీ ఇవ్వాలని అధికారులను కోరారు. ఇవ్వకుండా మళ్ళీ బదిలీలు ప్రక్రియ చేపడతామని అధికారులు చెబుతున్నారని హెల్త్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ ఉండడంతో ఉన్న స్థానాల్లో ఉంటామా లేక వేరే చోటకి బదిలీలపై వెళ్ళిపోతామా అన్న మనోవేదనలతో విధులు నిర్వర్తించడానికి ఇబ్బందులకు గురవుతున్నామని వారు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మళ్ళీ బదిలీలు చేపట్టకుండా ఇటీవల నిర్వహించిన బదిలీల ఆర్డర్ కాపీలను ఇవ్వాలని విన్నవించుకుంటున్నారు.

పదేపదే బదిలీ చేస్తామనడం సరికాదు

పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లకు పదేపదే బదిలీలు చేస్తూ వారికి మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదు.గత రెండు నెలల క్రితం బదిలీల ప్రక్రియ చేసిన వారికి ఆర్డర్స్ ఇవ్వకుండా జాప్యం చేయడం సరికాదు. ఆర్డర్స్ ఇవ్వకుండా మళ్ళీ బదిలీల ప్రక్రియ చేపడతామని చెప్పి మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదు. తాజాగా గత రెండు నెలల క్రితం బదిలీలు చేసిన వారికి ఆర్డర్స్ ఇచ్చి వారు విధులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఎస్‌బి పోతురాజు.
సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు

బంగారు కుటుంబాల దత్తతకు

మార్గదర్శకులు ముందుకు రావాలి

- కలెక్టర్ దినేష్ కుమార్



కలెక్టర్, జెసి దత్తత తీసుకున్న కుటుంబాలు

ప్రజాశక్తి -పాడేరు: బంగారు కుటుంబాల దత్తతకు, మార్గదర్శకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కలెక్టరెట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి 4 (పబ్లిక్, ప్రవేట్, పీపుల్, పార్ట్నర్ షిప్) వినూత్న కార్యక్రమాన్ని మార్చిలో ప్రారంభించినట్లు తెలిపారు. 9 మార్చి 2025 నుండి 25వ తేదీ వరకు సర్వే నిర్వహించామని వివరించారు. జిల్లాలో ఉన్న 352 సచివాలయాల్లో 144 సచివాలయాల్లో 92,683 బంగారు కుటుంబాలలో 3,13,041 కుటుంబ సభ్యులను గుర్తించినట్లు పేర్కొన్నారు. గుర్తించిన కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా తోడ్పాటు అందించడానికి దాతలు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. దత్తత కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఒక కుటుంబాన్ని దత్తత చేసుకున్నారు. పాడేరు మండలం ఐనాడ గ్రామానికి చెందిన రైతు కూలీ అయిన సాంబశివ కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. ఇతని కుమార్తె మానస నీట్ పరీక్షలు వ్రాసిన ర్యాంకు రాకపోవడంతో తన తండ్రి చదివించలేడని నిరాశకు గురైంది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు గమనించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దత్తత తీసుకొని నీట్ శిక్షణ ఇచ్చేందుకు తోడ్పాటు అందిస్తున్నారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మా కుటుంబానికి బంగారు కుటుంబంగా దత్తత తీసుకోవడం సంతోషంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. దత్తత చేసుకున్న వారికీ మార్గదర్శకులు నెలవారి ఆర్థికంగా ఏమి సహాయ చేయవలసిన అవసరం లేదన్నారు. పి4 ముఖ్య ఉదేశ్యం పేదరికం నుండి అభ్యున్నతి వైపు తీసుకువెళ్లడమేనని కలెక్టర్ తెలిపారు. సహాయం అందించిన వారు మార్గదర్శులు అన్నారు. దత్తతకు అర్హత కలిగిన బంగారు కుటుంబాల వివరాలు ఆన్లైన్లో పొందుపరచడం జరిగిందని, పోర్టల్ లో దేశంలో ఎవరైనా బంగారు కుటుంబాలకు దత్తత తీసుకోవచ్చునని సూచించారు. పోర్టల్లో పేరులేని వారు దగ్గరలో ఉన్న సచివాలయానికి వెళ్లి తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమానికి ప్రత్యేక అధికారులను నియమించామని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ, తాను గుత్తులపుట్టు నుండి ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవడం జరిగిందని, ఈ దత్తత 10మంది మార్గదర్శులు ముందుకి తీసుకోని ముందుకు రావడానికి ఉయోగపడుతుందన్నారు. పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ పాతిమా కుటుంబానికి దత్తత తీసుకున్నారని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ సాహిత్, ఉప కలెక్టర్ ఎం.ఎస్. లోకేశ్వరరావు పాల్గొన్నారు.



స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - విఆర్ పురం: దిగువన కురుస్తున్న భారీవర్షాలకు గోదావరి శబరి నదులు ఉప్పొంగడంతో ప్రజల్లో మళ్లీ ఆందోళన చెందుతున్నారు. గోదావరి వరద సోమవారం ఉదయం 11 గంటల నుండి పెరుగుతూ వస్తోంది. సోమవారం ఉదయం 34.30 అడుగులు ఉండగా సాయంత్రం నాలుగు గంటలకు 35.90గా ఉంది. ఎనిమిది అడుగులు వస్తే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. కాంటూర్ లెక్కలు పని లేకుండా ప్యాకేజీస్ట్రక్చర్ ఇచ్చి తరలించాలని ముంపు బాధితులు కోరుతున్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయంపై విచారణ జరపాలి

-అమ్మిన మద్యానికి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి
-బెల్ట్ షాపులు ఉన్నా చర్యలేవీ?
-ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు



లోతా రామారావు

ప్రజాశక్తి - రంపచోడవరం : గిరిజనుల పేరుతో తీసుకున్న మద్యం షాపుల్లో గిరిజనేతరులు అక్రమంగా నడుపుతున్నారని గిరిజనులను మభ్యపెట్టి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు ఒక ప్రకటనలో అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లో ప్రభుత్వం ద్వారా లాటరీ పొందిన గిరిజనుల పేరుతో తీసుకున్న షాపుల్లో గిరిజనేతర వ్యక్తులు నడుపుతున్నారన్నారు. తీసుకున్న మద్యానికి రసీదులు ఇవ్వడం లేదనీ, బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని కూడా కొన్నిచోట్ల విక్రయిస్తున్నారని దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్నారు. ఒకటాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'చలో విజయవాడ విద్యుత్‌సౌధ'ను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు: రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఆగస్టు 7న తలపెట్టిన ఛలో విజయవాడ విద్యుత్ సౌదా ముట్టడి కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీలేరు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి. లక్ష్మణ్ విష్ణుకుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చలో విజయవాడ పోస్టర్‌ను కాంట్రాక్ట్ కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఎపి జెన్‌కో, ట్రాన్స్‌కో డిస్కులు మరియు వివిధ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మాచ్‌ఖండ్, వనకఢిల్లీ, జ్వాలాపుట్‌లో పబ్లిక్ హెల్త్, క్యాంపు, వాటర్ ట్రీట్మెంట్ , పెస్ట్ కంట్రోల్, పాగింగ్ , ఎండ్ క్లీనింగ్ సెక్షన్లలో గత 20 సంవత్సరాలుగా 11 మంది కాంటాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని జీవో నెంబర్ 167, 129 ప్రకారం 11 మందిని మ్యాన్‌పవర్ వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. స్థానిక జల విద్యుత్ కేంద్రంలో మొత్తం 60 మంది కాంట్రాక్ట్ కార్మికులు గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఎపి జెన్కో ఆధ్వర్యంలో నడుస్తున్న భవ్య హెల్త్‌క్లినిక్‌లో ఎటువంటి వైద్యసేవలు అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. డివిజన్ వన్‌లో పనిచేస్తున్న ఆరుగురు పీస్ రేట్ కాంట్రాక్ట్ కార్మికులకు రోజుకు 400 చొప్పున నెలకు 5 రోజులు మాత్రమే పని దినాలు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 పిఆర్సి ఏరియర్స్ జీతాలు వ్యత్యాసం లేకుండా అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని బేసిక్ పే 46, 000 ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఆదివాసీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- 1 నుంచి 8 వరకూ వారోత్సవాలు
- 9న కోయ్‌తోర్ పండూందక్కాట్ కూనవరం కార్యక్రమానికి తరలిరండి
- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి - విఆర్ పురం: ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆగస్టు ఒకటి నుంచి 8వ తేదీ వరకూ ప్రతి ఆదివాసీ గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జెండాలు ఎగరవేసి ఆదివాసి వారోత్సవాలు నిర్వహించాలని, 9వ తేదీన కూనవరంలో జరిగే కోయ్‌తోర్ పండూం దక్కాట్ కార్యక్రమానికి ఆదివాసీలంతా తరలి రావాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కూనవరం మండలంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బాబురయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలందరూ 9వ తేదీన ఉత్సవాలు జరపడమే కాకుండా వారి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ ఆదివాసీ హక్కులు చట్టాలను పటిష్టంగా పాలకులు అమలు జరపాలని నినదించాలన్నారు. ఆదివాసీలు ఉద్యోగులు, మేధావులు ప్రజాప్రతినిధులు అంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆర్థిక సహకారాన్ని అందించాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు సీసం సురేష్, పూనెం ప్రదీప్‌కుమార్, పులి బొజ్జి, తెల్లం తమ్మయ్య, సర్పంచ్ నాగమణి, సర్పంచ్ వెంకమ్మ పాల్గొన్నారు.



యూనిఫాం పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సత్తిరెడ్డి

విద్యార్థి మిత్ర యూనిఫామ్ పంపిణీ

ప్రజాశక్తి -అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర యూనిఫాంలు సోమవారం పంపిణీ చేశారు. ఈనెల 26 మొదటి విడత మరియు 28 రెండో విడత యూనిఫారాలు మండలానికి వచ్చాయి. వీటిని అన్ని పాఠశాలలకు సోమవారం, మంగళవారం పంపిణీ చేస్తారు. పైనుంచి యూనిఫారాలు రావడం ఆలస్యం అయిందని ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ హెచ్‌ఎం సత్తిరెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

31న ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - చింతూరు: ఈ నెల 31న చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, ప్రకృతి వ్యవసాయం, పశుసంవర్ధకశాఖాధికారులతో నాలుగు మండలాల రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పిఒ అపూర్వభరత్ తెలిపారు. కార్యక్రమంలో శాఖలవారీగా వరి, మిర్చి సాగు, బిందు సేద్యం, తోటల పెంపకం, ఆయిల్‌ఫామ్ పెంపకం, పంటలు, పశువుల బీమా కోళ్లు, పశువుల పెంపకం, కిసాన్ క్రెడిట్‌కార్డ్స్, క్రాప్ బుకింగ్స్, సబ్సిడీలో ఎరువులు ఇతర సేవల గురించి రైతులకు వివరించడం జరుగుతుందని పిఒ తెలిపారు. నాలుగు మండలాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

30న అరకులోయలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ ఎస్ డి సి) ఆధ్వర్యంలో అరకు వ్యాలీ లోని ఆర్ఐటిఐ ప్రాంగణంలో ఈనెల 30న బుధవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 10 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి రోహిణి, సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ జాబ్ మేళాలో "అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, కేర్ ఫర్ యు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు పాన్ కార్డు, ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం 10,000 నుండి 20,000 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని తెలిపారు.

ప్రత్యేక మండలాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పెదబయలు : అరకు నియోజకవర్గం గోమంగిని, ఉప్పలను ప్రత్యేక మండలాలను ఏర్పాటు చేయాలని వైస్సార్సీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా సోషల్ మీడియా మాజీ అధ్యక్షులు డాక్టర్ తేడాబారికి సురేష్ కుమార్ కోరారు. 23 గ్రామ పంచాయతీలను కలిపి గోమంగిలో మండల కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. 1983లో అప్పటి ప్రభుత్వం మండలాలు ఏర్పాటు చేసిందని, పెదబయలు మండలం గోమంగికి రోడ్డు లేని కారణంగా ఒడిశాకు అనుకుని ఉన్న పెదబయలును మండల కేంద్రంగా ఏర్పాటు చేశారన్నారు. గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేస్తే 17 గ్రామ పంచాయతీలకు అనుకూలంగా ఉంటుందన్నారు. గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని 1998 నుంచి గోమంగి మండల సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. శివారు గ్రామాలకు పెదబయలు మండల కేంద్రం 45 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉందని ఏ పనికి వెళ్లాలన్నా ప్రజలు నిత్యం అవస్థలు పడుతు న్నారని చెప్పారు. అలాగే హుకుంపేట మండలం ఉప్ప ను కేంద్రంగా చేసుకుని మండలం గా ప్రకటించాలని కోరారు. సుమారుగా 15 పంచాయతీలు ఉప్పకు అనుకోని ఉంటుందన్నారు.

ఇంజినీరింగ్ పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-పాడేరు : రహదారులు, భవన నిర్మాణాలు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ విసి హాలు నుండి గిరిజన సంక్షేమ శాఖ, రహదారులు భవనాల శాఖల ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఇప్పటికి వరకూ జరిగిన ప్లాన్ వర్క్స్ ప్రపోజల్స్ పై ఆరా తీసారు. ముందస్తు అనుమతులు తీసుకోని పనులు నిర్వహిస్తే ఎటువంటి అభ్యంతరాలు ఉండవన్నారు. రంపచోడవరం ఇఇ మాట్లాడుతూ పేజ్ 1, పేజ్ 2 లో చేపట్టిన పనులు టార్గెట్లు అచీవ్ మెంట్ కలెక్టర్కు వివరించారు. సెప్టెంబర్ మాసాంతానికి పనులు పూర్తి చేస్తామన్నారు. పిఎం జన్మన్ పనుల పురోగతి వివరించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్వాడీ భవనాలు, పిఎం జన్మన్ పథకంలో మంజూరు చేసిన పనులు, సిసిడిపిలో చేపట్టిన పనుల పురోగతి రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై కలెక్టర్ సమీక్షించారు.

సిసి రోడ్ల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వై రామారం నాలుగు బర్త్ వెయిటింగ్ హోమ్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా నేటికి మూడు భవనాలు పూర్తి అయ్యాయని, సెప్టెంబర్ నెలాఖరు నాటికి మిగిలిన ఒక్కటి పూర్తీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పాడేరు ఐటిడి ఏ ఇంచార్జి పిఓ ఎం.జె. అభిషేక్ గౌడ, రంపచోడవరం పి ఓ కె. సింహచలం, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, పాడేరు డిఇఇ పిఆర్ఐ జి.నరేంద్రకుమార్, పాడేరు డిఇఇ పిఐయు పి.మధు , అరకు టి.డబ్ల్యు ఇఇ కెవేణుగోపాల్, పాడేరు పిఆర్ఐ ఇఇ టి.కొండయ్య, అరకు పిఆర్ డిఇఇ ఆర్.రామం, డిఇఇ పిఐయు బి.రవికుమార్, పశు సంవర్ధక శాఖ అధికారులు, డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు...

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - పెదబయలు :మండల కేంద్రంలో జరిగిన వారపు సంతలో స్థానిక వైద్యాధికారి నిఖిల్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య, తహసీల్దార్ వంజంగి త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్



డ్రోన్ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:కిసాన్ డ్రోన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో వై.రామవరం మండలం దాలిపాడు గ్రామానికి చెందిన శ్రీ దుర్గా భవానీ గ్రూప్ సభ్యులు డ్రోన్ పైలెట్ వెంకట శివ సాయికి రూ. 9,80,000 విలువ చేసే డ్రోన్ ను 80శాతం రాయితీతో జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సి హెచ్ సి ద్వారా ఎరువులు, పురుగు మందులు ప్రవాహంలో ఉన్న వాటిపై ఈ డ్రోన్ పిచికారి చేస్తుందని, రైతుకు సమయం, వ్యయం కలిసి వస్తుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్ పాల్గొన్నారు.

ఆగస్టు 2 నుండి ఆకాంక్ష హాట్

పాడేరు: సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 2 నుండి ఆకాంక్ష హాట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడతో కలిసి మాట్లాడుతూ, యాస్పిరేషన్ జిల్లాగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎంపిక కావడం సంతోషంగా ఉందని కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు.రంపచోడవరం డివిజన్లో గంగవరం, మారేడుమిల్లి, మైలవరం ఒక యాస్పిరేషన్ గా గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో హెల్త్ అండ్ న్యూట్రిషన్, వ్యవసాయం, విద్య, మోడల్ స్కూల్, సోషల్ డెవలప్మెంట్ అనే 6 అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నీతి ఆయోగ్ కింద జిల్లాకు రూ: 10కోట్లు ఇన్సెంటివ్ ఇవ్వడం జరిగిందన్నారు. కాఫీ పంట ఇతర ఉద్యాన పంటలను మేడిన్ అరకుగా బ్రాండ్ తీసుకు రావడంతో గిరిజన రైతులకు మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ప్రత్యేక స్కూల్, టీచర్లు, వాతావరణం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 2వ తేదీన వివిధ శాఖల్లో, వివిధ స్థాయిలో బాగా పనిచేస్తున్న ఉద్యోగులను సన్మానించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఆగస్టు 2వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆకాంక్ష హాట్ కాఫీ హౌస్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆకాంక్ష హాట్ కి ప్రజలు సందర్శించి ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు.

వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలి

ప్రజాశక్తి-పాడేరు: వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం ప్రధాన లక్ష్యమని, ప్రకృతి వైపరీత్యాలపై రైతులను ముందుగా సమాచారం అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అగ్రి స్టాక్ పై జిల్లా స్థాయి కమిటీ నిర్వహణకు సంబంధించి మార్కెటింగ్, మార్క్ ఫెడ్, మత్స్య, ఉద్యాన, సెరికల్చర్, ఇరిగేషన్, ఇన్సూరెన్స్ తదితర సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్, మార్క్ ఫెడ్, మత్స్య, ఉద్యాన, సెరికల్చర్, ఇరిగేషన్, ఇన్సూరెన్స్ శాఖల అధికారులు శాఖా పరంగా చేపడుతున్న టెక్నాలజీ వివరించారు. జిల్లా కలెక్టర్ డ్రోన్, మార్కెటింగ్ విలేజ్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్ భవిష్యత్తులో తీసుకోబోయే టెక్నాలజీ పై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులపై ఆరా తీశారు. క్రెడిట్ కార్డు ట్రాంజక్షన్స్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సంజీవని ఎన్జీఓ దేవుళ్ళు మాట్లాడుతూ, డేటా బేస్ సరిలేక ఇంకా ఈ క్రాప్ పూర్తి స్థాయిలో జరగలేదని అందుకోసం అన్ని శాఖల సమన్వయంతో ఒక ప్రత్యేక డ్రైవ్ చేపడితే మంచి ఫలితాలు రాబడానికి అవకాశం ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫీడర్స్ ఉపయోగించితే ఫలితాలు వస్తాయన్నారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, చింతూరు, రంపచోడవరం ఐటిడిఎ పిఒలు అపూర్వ భరత్, కె.సింహాచలం పాల్గొన్నారు. సమావేశంలో సిపిఒ పివిఎస్ ప్రసాద్, ఉద్యాన అధికారి ప్రకాష్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్, మత్స్య శాఖ అధికారి పి. శ్రీనివాస రావు పాల్గొన్నారు.

బురద రోడ్డులో కూరుకుపోతున్న వాహనాలు

- రాకపోకల్లో గిరిజనులకు తప్పని ఇబ్బందులు



మట్టిరోడ్డులో కూరుకుపోయిన వాహనాలతో కుస్తీ పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అరకులోయ మండలంలోని బస్కి పంచాయితీ కొంత్రయిగూడ, బిజ్జగూడ గ్రామాలకు వెళ్లి మట్టి రోడ్డు అధ్వానంగా మారింది.రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఆటోలు, వాహనాలు బురద మట్టిలో కూరుకుపోతున్న పరిస్థితి నెలకొంది. అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురద మయంగా రోడ్డు తయారైంది. చిన్నపాటి చినుకుపడితే చాలు రోడ్డు బురదమయంగా మారి రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, పాదచారులు చెపుతున్నారు. గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం బాగాలేనప్పుడు ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమ గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కృష్ణాపురం గ్రామానికి చెందిన కేపారీ అముడు (26), కొయ్యూరు మండలం మర్రివాడ పంచాయతీ పిడితమామిడి గ్రామానికి చెందిన సుర్ల గంగరాజు (18) ద్విచక్ర వాహనంపై కృష్ణాపురం గ్రామానికి ప్రయాణిస్తున్నారు. రహదారిపై నిలిచివున్న ట్రాక్టర్ను వీరు ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామస్థులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించి గాయపడిన వారిని చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కేపారీ అముడు పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై ఎం.వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

150 లీటర్ల నాటు సారా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని ఓల్డా పంచాయతీ పరిధిలోని పోసలగురువు, ఉప్ప గ్రామాల్లో సోమవారం సారా తయారీ కేంద్రాలపై హుకుంపేట సీఐ సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో, సివిల్ పోలీసులు, జిల్లా ఎక్సైజ్ శాఖతో కలిసి సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, ఈ దాడుల్లో సుమారు 6000 లీటర్ల సారా తయారీకి సిద్ధంగా ఉన్న పులుపును ధ్వంసం చేయగా, 150 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.ఈ ప్రాంతాల్లో కొందరు గ్రామస్తులు సారా తయారీ వ్యాపారంలో నిమగ్నమై ఉన్నారని, గతంలో దాడులు చేసినప్పుడు కూడా వ్యాపారులు ఇళ్ళు వదిలి పారిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. వీరి వివరాల గురించి గ్రామస్తులను అడిగితే తెలీదు అంటూ తప్పించుకుంటున్నారని అయన చెప్పారు. వీఆర్ఏ, వీఆర్వోల సహకారంతో పారిపోయిన వారిపై వివరాలు సేకరించి, త్వరలో వారిని అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ టీవీవీఎస్ఎన్ ఆచార్య, స్థానిక ఎస్సై సూర్యనారాయణ పాల్గొన్నారు.

మావోయిస్టులపై డ్రోన్లతో నిఘా

ప్రజాశక్తి-చింతపల్లి:మన్యం ప్రాంతాల్లో మావోయిస్టుల ఆసాంఘిక శక్తులపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి అవకాశం కల్పించకూడదని చింతపల్లి సీఐ ఎం. వినోద్ బాబు హెచ్చరించారు. సోమవారం స్థానిక సీఐ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మావోయిస్టుల ప్రభావం గణనీయంగా తగ్గుముఖం పట్టిందని, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలైన ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టులకు తిరిగే వెసులుబాటు లేకుండా చర్యలు చేపట్టామన్నారు.ఈ సమావేశంలో స్థానిక ఎస్సై ఎం. వెంకటరమణ పాల్గొన్నారు. చింతపల్లి పరిసర ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ అల్లర్లు సృష్టించే వారి పై కఠిన చర్యలు తప్పవని చింతపల్లి సీఐ ఎం.వినోద్ బాబు హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, మద్యం సీసాలు పగలగొట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న తాగుబోతులపై ప్రత్యేక డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తింపు చేపట్టి, వారిపై కేసులు నమోదు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ

నిబంధనలకు అనుగుణంగా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాలు అన్వేషించి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపుతున్నామని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో ప్రజాసమస్యలపరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. పిఒ సింహాచలం మాట్లాడుతూ ఈవారం 64 అర్జీలు వచ్చాయని వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

గడి బాపనమ్మ దేవస్థానం డైరెక్టర్లుగా సుందరం, బాబూరావు


ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో సీతపల్లి గ్రామంలో గడిబాపనమ్మ అమ్మవారి దేవస్థానం నూతన ధర్మకర్తలమండలిలో సభ్యులుగా మండలంలోని జడ్డంగి గ్రామ 96వ బూత్ ఇంచార్జి, టిడిపి సీనియర్ నాయకులు కాళ్ళకూరి సత్య సుందరం, రాజవొమ్మంగి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు,సామాజిక సేవకుడు కొరువాడ బాబురావు నియమితుల య్యారని టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన డింబకేశ్వరరావు సోమవారం తెలిపారు. మంచి వ్యక్తులకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్కు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికైన వీరికి మండల కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు గ్రామ పంచాయతీ పరిధిలోని శబరి ఒడ్డున ఉన్నటు వంటి అంగన్వాడి కేంద్రానికి 2022లో వరదలు వచ్చినప్పటి నుంచి విద్యుత్ సౌకర్యం లేక ఇబందులు పడుతున్నారు. సమస్యను అంగన్వాడీ కార్యకర్త సత్యవతి, చింతూరు సర్పంచ్ కారం కన్నారావు, పంచాయితీ కార్యదర్శి సి.హెచ్.గంగరాజు దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను తెలుసుకున్న సర్పంచ్, కార్యదర్శులు విద్యుత్శాఖ సిబ్బందితో మాట్లాడి సోమవారం పంచాయతీ సిబ్బందితో కలిసి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి వెంటనే విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. పంచాయతీ సిబ్బందికి వారంతి కృతజ్ఞతలు తెలియజేసారు.

ఆర్వి.నగర్, పాలగెడ్డ రహదారి పనులు చేపట్టాలి

- డిసిసి కార్యదర్శి కారె శ్రీనివాస్



ఆర్వి.నగర్ పాలగెడ్డ రహదారి

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం ఆర్వి నగర్ నుంచి పాలగెడ్డ వరకూ రహదారి నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని డిసిసి కార్యదర్శి కారె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడుతూ సంవత్సరాల తరబడి రహదారి నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ప్రజాప్రతినిధులు ఎంత మొరపెట్టుకున్నా ఆర్అండ్బి అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితం ఆర్అండ్బి ఎస్ఇ ఇతర అధికారులు కాంట్రాక్టర్లు రహదారి పరిస్థితిపై పరిశీలించినప్పటికీ ఇప్పటివరకు రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని కోరారు.

ప్రతి అధికారీ ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో బాగా పేదరికంలో ఉన్న వారిని ఒక్కొక్క అధికారి ఒక్కొక్క కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, ఎపిఒ జనరల్ డి ఎన్ వి రమణ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పి4 అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఐఎఎస్ అధికారి ముందుగా ఒక్కొక్క కుటుంబాన్ని దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. ఒక్కొక్క అధికారి, ఒక్కొక్క పాత్రికేయమిత్రుడు ఒక్కొక్క కుటుంబాన్ని దత్తత తీసుకొని పేదరికంలో ఉన్నవారి జీవనశైలిని మార్పు వచ్చే విధంగా మనందరం కృషి చేయాలన్నారు.

రంపచోడవరం సబ్కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులు అభివృద్ధి చెందే విధంగా అంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, పాత్రికేయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిఐలు బాధ్యతల స్వీకరణ



సిఐగా బాధ్యతలు తీసుకుంటున్న నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - మారేడుమిల్లి: గుర్తేడు, మారేడుమిల్లి సిఐగా సోమవారం సిఐ నాగేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయనకు మారేడుమిల్లి ఎస్ఐ శ్రీనివాస్, గుర్తేడు ఎస్సై వెంకయ్య స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్టేషన్సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవలు అందిస్తానన్నారు. యువత గంజాయి, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సిఐ గోపాలకృష్ణ చింతూరు సిఐగా బదిలీపై వెళ్లారు.



రాజఒమ్మంగి సిఐగా బాధ్యతలు తీసుకుంటున్న గౌరీశంకర్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సిఐగా గౌరీశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గౌరీశంకర్ కాకినాడ ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్లో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సిఐ సన్యాసినాయుడు రంపచోడవరం బదిలీపై వెళ్లారు. సిఐగా బాధ్యతలు స్వీకరించిన గౌరీశంకర్ను రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు నరసింహమూర్తి, చినబాబు, పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

అధ్వానంగా భద్రాచలం- దుమ్ముగూడెం రహదారి



గుంతలు పడిన భద్రాచలం -దుమ్ముగూడెం రహదారి

ప్రజాశక్తి - ఎటపాక: తెలంగాణ- ఆంధ్ర మధ్య ఉన్న సరిహద్దు గ్రామాల రహదారులపైన ప్రయాణం ప్రమాదకరంగా మారింది. తెలంగాణ రాష్ట్రం భద్రాచలం నుండి దుమ్ముగూడెం వైపు వెళ్లాలంటే మధ్యలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఎటపాక, పిచ్చుకల పాడు, కన్నాయిగూడెం గ్రామాలను దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఈ మూడు గ్రామాల పరిధిలో ప్రధాన రహదారి భారీ గుంతల తో ప్రమాదకరంగా తయారైంది. ఈ రహదారిలో రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే సాహసం అనే చెప్పాలి. భారీ వాహనాలు తిరిగే ఈ రహదారి గత ఐదారు సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఎటపాక మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయలకు వెళ్లే దారిలో, పోలీస్స్టేషన్కు ఎదురుగా పెద్దపెద్ద గుంతలు ఏర్పడినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎటపాక, పిచ్చుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలనే వాదనకు బలం చేకూర్చేలా ఈ రహదారి దుస్థితి ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

జివిఎంసి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 174 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అన్ని విభాగాలకు కలిపి 174 వినతులు వచ్చినట్టు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో కమిషనర్ కేతన్గార్గ్తో కలసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జివిఎంసికి సంబంధించి 174 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు పెట్టుకున్న అర్జీలను, ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు ఇవ్వకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమిషనర్లను కమిషనర్ ఆదేశించారు.

పోలీస్ కమిషనరేట్లో వ్యక్తి హల్చల్

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ సోమవారం కాన్ఫరెన్స్హాల్ వద్ద వేపాడ పవన్కుమార్ అనే వ్యక్తి పిజిఆర్ఎస్ వద్ద పెట్రోల్ తీసుకువచ్చి హల్చల్ చేశాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకోబోతే పోలీస్ సిబ్బంది వారించి ఫోర్త్ టౌన్ పోలీస్స్టేషన్కు తరలించారు. సైబర్ సెక్యూరిటీసెల్లో ఉద్యోగం ఇప్పిస్తానని పవన్కుమార్ను సంజయ్రెడ్డి అనే వ్యక్తి నమ్మించాడు. రూ.7 లక్షలకు పైగా వసూలు చేసి మొహం చాటేశాడు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ పవన్ పోలీసుల్ని ఆశ్రయించాడు. విచారించిన పోలీసులు సంజయ్ నుంచి కొంత మొత్తాన్ని పవన్కి ఇప్పటికే ఇప్పించారు. మిగతా మొత్తాన్ని త్వరలోనే తిరిగి ఇచ్చేస్తానని సంజయ్ హామీ ఇచ్చాడు. అయితే చాలారోజులవుతున్నా తనకు సొమ్ము తిరిగి ఇవ్వలేదంటూ పవన్ బలవన్మరణానికి ప్రయత్నించాడు. పోలీసులు అతనిని వారించి, త్వరలోనే సొమ్ము ఇప్పిస్తామని, లేదంటే ఫిర్యాదిస్తే సంజయ్రెడ్డిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కెజిహెచ్లో హెపటైటిస్ దినోత్సవం

- స్క్రీనింగ్,టీకాల కార్యక్రమం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం కెజిహెచ్లోని గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో హెపటైటిస్ స్క్రీనింగ్, టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 508 మంది హాస్పిటల్ సిబ్బంది హెపటైటిస్ బి స్క్రీనింగ్ చేసి, వారికి టీకాలు వేసారు. అలాగే,హెపటైటిస్ గురించి అవగాహన కల్పించారు. హెపటైటిస్ బి దాని నివారణ, ప్రాథమిక పరీక్షల ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ ప్రారంభించారు. గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్, డాక్టర్ డి.వంశీయాదవ్, డాక్టర్ ఎస్.శ్రీదేవి కార్యక్రమంలో పాల్గొని టీకాలు వేశారు.

జర్నలిస్టుల సమస్యలపై సానుకూల నిర్ణయం

- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఆగస్టు 6న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టులకు మేలు కలిగే నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతుమహంతి నారాయణ్, జి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్, బ్రాడ్కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఎపిడబ్ల్యూజెఎఫ్ సంయుక్త కార్యదర్శులు నాగేశ్వరరావు, నగేష్ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్లు, ఇంటి స్థలం, అక్రిడేషన్కార్డులు, పింఛన్లు ఇచ్చే ప్రక్రియపై క్యాబినెట్లో చర్చించి ఒక నిర్ణయం తీసుకొంటామన్నారు. ఇప్పటికే రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల పింఛన్లపై పదేపదే ప్రస్తావిస్తూ వస్తున్నారని చెప్పారు. వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. జర్నలిస్టుల సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.